క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


గాయత్రీ మాత

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపా మోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పౌర్ణమి పూజలు



మద్దికెర : స్థానిక మద్దమ్మ చెరువు కట్ట మీద కొలువైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

గంధోత్సవం


గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

మద్దికెర : స్థానిక రైల్వే గేట్ వద్దనున్న ఇమాం సాహెబ్ స్వామి ఉరుసులో భాగంగా శుక్రవారం గంధం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి గంధాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా చైతన్యయాత్ర

దేవనకొండ: ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా చైతన్యయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.వి.నారాయణ, బి.వీరశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుంకనూరు గ్రామంలో ప్రజా చైతన్యయాత్రను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, సీసీ రోడ్లు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు అశోక్, నాయకులు శ్రీనివాసులు, సింహాద్రి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

హాలహర్వి: మండలంలో నేటి నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఈరన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈనెల 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 7;45 నుంచి మధ్యాహ్నం 12;30 గంటల వరకు బడులు ఉంటాయన్నారు. అలాగే పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం 1;15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు పనిచేస్తాయని పేర్కొన్నారు.

పెట్రోల్ కల్తీపై నిలదీసిన బాధితుడు


పెట్రోల్‌లో నీరు కలిసిందని నిర్వాహకులను నిలదీస్తున్న బాధితుడు

ఆలూరు రూరల్: పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఓ పెట్రోల్ బంకులోని పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని బాధితుడు నిర్వాహకులను నిలదీశాడు. రామదుర్గం గ్రామానికి చెందిన ఈరన్న శుక్రవారం తన బైక్ పెట్రోల్ లేక నిలిచిపోవడంతో బాటిల్‌లో పెట్రోల్ పోయించుకుని వెళ్లాడు. బైక్‌లో పెట్రోల్ వేసిన తర్వాత స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్ దగ్గరకు వెళ్లాడు. పెట్రోల్‌లో నీళ్లు కలవడంతో బైక్ స్టార్ట్ కావడం లేదని మెకానిక్ చెప్పడంతో పెట్రోల్ బంకు నిర్వాహకులను నిలదీశాడు. అనంతరం సివిల్ సప్లయీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. పెట్రోల్ బంకులోని పంపు నుంచి పెట్రోల్ శ్యాంపుల్ సేకరించి పోలీసు స్టేషన్‌లో ఉంచారు. పెట్రోల్ కల్తీపై నేడు రెవెన్యూ శాఖ అధికారులు పరీక్షలు నిర్వహించనున్నారు. బాటిల్‌లో కొంచం నీళ్లున్నా మొత్తం పెట్రోల్ కలుషితం అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక

పెద్దకడబూరు : మండలంలోని కల్లుకుంట గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ దుబ్బన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎం.బాబు, చాంద్‌బాషా, వి.గంగాధర్, ఎండీ శరత్, వీ.సతీష్ ఎన్నికయ్యారని, ఈ నెల 15, 16 తేదీల్లో విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

పది పరీక్షలకు సిద్ధం

- నియోజకవర్గంలో పరీక్ష రాయనున్న 4,096 మంది విద్యార్థులు
- 19 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఠాణాకు చేరిన ప్రశ్నపత్రాలు


తుగ్గలి పోలీస్ స్టేషన్‌లోకి ప్రశ్నపత్రాలు తీసుకెళ్తున్న రూట్ ఆఫీసర్లు

తుగ్గలి : ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జెడ్పీ ఉన్నత, గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రైవేటు స్కూళ్ల నుంచి మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాట్లు చేశారు. మొత్తం 4,096 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్ సరఫరా ఇతర ఏర్పాట్లు చేశారు. ప్రశ్న పత్రాలను రూట్ ఆఫీసర్లు పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు.

నియోజకవర్గంలో పరీక్షా కేంద్రాల వివరాలు..

పత్తికొండ మండలంలో..

- సెయింట్ జోసెఫ్, ఏపీ మోడల్, యశోద గార్డెన్ స్కూల్, ప్రభుత్వ బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలు.

పరీక్ష రాసే విద్యార్థులు : 1,425

తుగ్గలి మండలంలో..

- తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల, నోవీ కాన్సెప్ట్, జొన్నగిరి, పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలు..

పరీక్ష రాసే విద్యార్థులు : 618

కృష్ణగిరి మండలంలో..

- కంబాలపాడు, కృష్ణగిరి జెడ్పీ ఉన్నత,అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు

పరీక్ష రాసే విద్యార్థులు : 571

వెల్దుర్తి మండలంలో..

- వెల్దుర్తి బాలుర, బాలికల, రామళ్లకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలు, అంబేడ్కర్ గురుకల పాఠశాలలో ఏ, బి కేంద్రాలు

పరీక్ష రాసే విద్యార్థులు : 951

మద్దికెర మండలంలో..

- మద్దికెర బాలుర, బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలు

పరీక్ష రాసే విద్యార్థులు : 531

పరీక్షల షెడ్యూల్..

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 17న తెలుగు, 19న హిందీ, 21న ఇంగ్లిష్, 24న గణితం, 26న ఫిజికల్ సైన్స్, 28 బయాలాజికల్ సైన్స్, 31లేదా ఏప్రిల్ 1న సోషియల్.

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



గతేడాది కంటే ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ఉపాధ్యాయులు నిరంతరం వారి చదువుపై దృష్టి సారించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. – రామావెంకటేశ్వర్లు, ఎంఈవో–2, తుగ్గలి మండలం

రంగుల హోలీ..ఆనందాల కేళి


పత్తికొండలో రంగులు చల్లుకుంటున్న యువకులు

- అంబరాన్నంటిన హోలీ సంబరాలు
- ఉల్లాసంగా, ఉత్సాహంగా యువత

పత్తికొండ రూరల్ : చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగానే కాకుండా సుఖం, దుఃఖం, సంతోషం, విచారం కలయికగా రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒకే చోటకు చేర్చే సంగమమే హోలీ. ఏటా జరుపుకునే హోలీని శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. గిరిజన తండాల్లో వారం రోజులు ముందుగానే పండుగ సందడి మొదలైంది. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ గ్రామాలకు చేరుకున్నారు. తండాల్లో భక్తిశ్రద్ధలతో పితృదేవతలకు పూజలు నిర్వహించారు.

హోలీ విశిష్టత..

చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా నిర్వహించుకునే హోలీ పండుగకు పురాణాల ప్రకారంగా విశిష్టత ఉంది. హిరణ్యకశిపుని సోదరి హోలిక అనే రాక్షసి శ్రీమహావిష్ణువు భక్తుడైన ప్రహ్లాదుడిని చంపేందుకు మంటల్లో వేస్తుంది. దైవ లీలతో ప్రహ్లాదుడు తప్పించుకుంటాడు. ఆ మంటల్లో హోలిక పడిపోయి దహనమవుతుంది. రాక్షస సంహారం జరిగిన సందర్భంగా ఆనందోత్సాహాలతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని పండుగ జరుపుకోవడం ఆనవాయితీ.

ఎల్ తండాలో..

వెల్దుర్తి: మండలంలోని లక్ష్మీ నగరం మజరా గ్రామమైన లక్ష్మీనగరం తండాలో శుక్రవారం హోలీ పండుగ సంబరాలు హోరెత్తాయి. సంప్రదాయ పద్ధతులతో, ఆనందోత్సవాల మధ్య తండా వాసులు చిన్నా, పెద్దా తేడా లేకుండా రంగుల హోలీని జరుపుకున్నారు. నెలరోజులుగా పండుగ ఏర్పాట్లలో మునిగిన గ్రామంలోని మొత్తం 75 కుటుంబాలు హోలీ పౌర్ణమి పురస్కరించుకొని గ్రామ నడిబొడ్డున చేరి కట్టెలు పేర్చి, మంటలు రేపి కామదహనం కార్యక్రమాన్ని కేరింతలతో జరుపుకున్నారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగితేలారు. మహిళలు సంప్రదాయ గీతాలకు నృత్యాలు చేశారు.

వేడుకల్లో అపశృతి..

రత్నపల్లె గ్రామ సమీపంలోని ఇటుకల బట్టీలో పని చేసే ఒడిశాకు చెందిన కార్మికులు శుక్రవారం హోలీ జరుపుకున్నారు. కామదహనం పేరిట మంట వేసి చుట్టూ నృత్యం చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ బంటు అనే యువకుడు మంటల్లో పడ్డాడు. వెంటనే పక్కకు లాగేసినా అప్పటికే అతని ఎడమ చేతికి గాయాలయ్యాయి. తోటి కార్మికులు, యజమాన్యం క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మద్దికెర : మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.57.22 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే కేయి శ్యాంకుమార్ శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కరించేందుకు ఇంటింటికీ కుళాయి వేయించి నీటిని సరఫరా చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో రూ.20 లక్షలతో వేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే..పెరవలి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు.సర్పంచ్ విజయుడు, మండల ఉపాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, ఎంపీటీసీ వేణమ్మ, కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఖాన్, ఏఈ మయాంక్, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, వీఆర్వో స్వర్ణమ్మ పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెస్కులపై హాల్ టికెట్ నంబర్లు వేసిన దృశ్యం

హొళగుంద: ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం శుక్రవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 461 మంది విద్యార్థులకు రెండు, కేజీబీవీలో 128 మంది విద్యార్థులకు ఒకటి , హొళగుంద జూనియర్ కళాశాలలో 200 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున మొత్తం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. హొళగుంద, హెబ్బటం, ఎల్లార్తి, గజ్జహళ్లి, సుళువాయి, హొళగుంద హైస్కూళ్లతో పాటు కేజీబీవీ విద్యార్థినులు మొత్తం 789 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఇప్పటికే సెట్–1, సెట్–2 ప్రశ్న పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్ర పరిచామని చెప్పారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులకు తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచుతామన్నారు. సెంటర్లకు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లుగా అబ్దుల్‌మునాఫ్, ప్రసాద్, ఇమాంవలి, సుధాకర్, చీఫ్‌లుగా కబీర్‌సాబ్, పంపాపతిగౌడ్, రమణయ్య, మహమ్మద్ హుసేన్ వ్యవహరిస్తారని వివరించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

ఆలూరు: పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసేవారికి మండల కమిటీల్లో స్థానం కల్పించారని, ఆయా పదవుల్లో నియమితులైన వారు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్యే బి.విరూపాక్షి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేసే వారిని గుర్తించి వివిధ హోదాల్లో నియమించారన్నారు. మీ అందరికి అండగా తానుంటానని, కలసికట్టుగా ప్రజా సమస్యలపై పోరాడదామని పిలుపునిచ్చారు.

పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తూ..ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు.

వైభవంగా లంకోత్సవం


దేవేరులతో కలిసి హనుమంతుడిపై కొలువుదీరిన శ్రీరంగనాథుడు

మద్దికెర : పెరవలి శ్రీరంగనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం లంకోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులను అందంగా ముస్తాబు చేసి హనుమంతుడిపై కొలువుంచి గ్రామ పుర వీధుల్లో జనవాహిని మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తెప్పించిన బాణా సంచా కాల్చారు. లంకోత్సవం రోజున హనుమంతుడికి స్వామి వారు రాముడి రూపంలో కన్పించారని అందువల్ల బ్రహ్మోత్సవాల్లో భక్తులు శ్రీవారిని దర్శించుకుంటే బుద్ధి, బలం, ధైర్యం పొందుతారని ప్రతీతి. ఈఓ వీరయ్య, అర్చకులుతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని వాలీబాల్ క్రీడాకారులకు బీఆర్ఎస్ కూరగాయల వ్యాపారి అభిరాం శుక్రవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు.తన తాత రామాంజినేయులు వర్ధంతి సందర్భంగా క్రీడాకారులకు వాలీబాల్ కిట్, క్రీడా దుస్తులను అందజేశారు.

బుగ్గతండాలో నవోదయంపై కళాజాత

పత్తికొండ రూరల్: మండలంలోని బుగ్గతండా గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరావు ఆధ్వర్యంలో నవోదయంపై కళాజాత నిర్వహించారు. కళాజాత బృందం నాటుసారా తయారీ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో చేపల మృత్యువాత


తుగ్గలి : మండలంలోని జొన్నగిరి చెరువులో చేపలు మృత్యువాత పడుతున్నాయి. ఐదు నెలల క్రితం వేలం పాటదారుడు చెరువులో చేపలను వదిలారు. అయితే మూడు రోజులుగా చేపలు మృత్యువాత పడుతుండటంతో మత్స్యశాఖ అధికారులు చెరువును పరిశీలించారు. చేపల మృతికి కారణాలు తెలుసుకోవడానికి చెరువులో నీటితో పాటు చనిపోయిన చేపలను పరీక్షల నిమిత్తం మత్స్యశాఖ అధికారులు తీసుకెళ్లినట్లు తెలిసింది.

విద్యుత్ వేళల్లో మార్పులు

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల, కంబాలపాడు, కృష్ణగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మూడో శనివారం సందర్భంగా విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి శుక్రవారం తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయానికి ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని, రైతులు గమనించాలని కోరారు.

ఆర్మీ ఉద్యోగిపై కేసు నమోదు

వెల్దుర్తి: మండలంలోని బింగిదొడ్డి గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఘర్షణ సంఘటనలో ఆర్మీ ఉద్యోగి భాస్కర్ రెడ్డి, అతని వర్గంలోని మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ శుక్రవారం తెలిపారు. ఇరువర్గాల మధ్య మనస్పర్థల నేపథ్యంలో ఘర్షణ చోటుచేసుకోగా ఆర్మీ ఉద్యోగి సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, కుటుంబ సభ్యులపై దౌర్జన్యానికి దిగినట్లు సర్పంచ్ కుమారుడు సుధాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.


చుంచుఎర్రగుడి సమీపంలో సాగు చేసిన చీనీ తోట

పెరుగుతున్న ‘ఉద్యాన’సాగు

- విస్తారంగా చీనీ, దానిమ్మ తోటలు
- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు


చిట్యాల సమీపంలో సాగు చేసిన దానిమ్మ తోట


కోయిలకొండ సమీపంలో సాగు చేసిన అరటి తోట

కృష్ణగిరి: మండలంలో ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. వీటి సాగుకు నీటి సౌకర్యం ఎక్కువగా ఉండాలి. కానీ 2007లో నాటి సీఎం వైఎస్సార్ హయాంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి పునాది వేశారు. కాలువ దీన్ని పూర్తి చేసి 2013లో అప్పటి వ్యవసాయ మంత్రి రఘువీరారెడ్డి ఈ కాలువ వెంట నీరు తీసుకెళ్తూ జీడిపల్లి వరకు పాదయాత్ర చేశారు. అప్పటి నుంచి హంద్రీనీవా ప్రధాన కాలువకు శ్రీశైలం బ్యాక్ వ్యాటర్ రావడంతో ఈ ప్రాంతంలో నీటి లభ్యత ఎక్కువైంది. దీంతో మండలంలోని సగం గ్రామాల్లో భూమిలో నీటి లభ్యత పెరగడంతో బోరుల కింద పంటల సాగుకు పూనుకున్నారు. మండలంలోని చుంచుఎర్రగుడి, చిట్యాల, కోయిలకొండ తదితర గ్రామాల్లో రైతులు దాదాపు 60 శాతానికి పైగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. చీనీ, దానిమ్మ, ఆరటి, బొప్పాయి తదితర పంటలను సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. ఆయా గ్రామాల రైతులు పండ్ల తోటలతో లాభాలు చూస్తుండటంతో మిగిలిన గ్రామాల్లో క్రమేణా సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. మొత్తం మీద దాదాపు 2వేల ఎకరాల్లో తోటలు సాగవుతున్నాయి.

జొన్నచొప్ప బూడిదపాలు


పొలాల్లో తగలబెట్టిన జొన్నచొప్ప

హాలహర్వి: మండలంలోని గూళ్యం, పచ్చారపల్లి, సిద్ధాపురం, బల్లూరు తదితర గ్రామాల్లో జొన్న చొప్పను పొలాల్లోనే రైతులు కాల్చి వేస్తున్నారు. గ్రామాల్లోని రైతులు, ప్రజలు.. ఎద్దులు, పశువులను అమ్ముకోవడంతో జొన్నచొప్పను కొనుగోలు చేసేవారు కరువయ్యారు. దీంతో జొన్న పంట సాగు చేసిన రైతులు చేసేదేమి లేక పొలాల్లోనే చొప్పను తగలబెడుతున్నారు.

టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమి పూజ


భూమిపూజ చేస్తున్న మంత్రి టిజి.భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

పత్తికొండ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.11 కోట్ల అంచనా వ్యయంతో మండలంలోని కనకదిన్నె గ్రామంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరునెలల్లో యూనిట్ ప్రారంభం కావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ యూనిట్ ద్వారా కేవలం టమాట పంటనే కాకుండా మామిడి, జామ, అరటి, బొప్పాయల ప్రాసెసింగ్ కూడా చేయొచ్చన్నారు. వంద మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రాసెసింగ్ యూనిట్ ఉత్పాదక సామర్థ్యాన్ని గురించి వివరించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ గెడ్డం శేఖర్‌బాబు, ఆర్డీఓ భరత్‌నాయక్ పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చిప్పగిరి: టైలరింగ్‌లో శిక్షణ తరగతుల కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ అల్లాబకాష్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ లోపు సమీప గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు అందజేయాలని చెప్పారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన అభ్యర్థులకు కుట్టు మిషన్ అందజేస్తామని పేర్కొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

దేవనకొండ: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ మాల బండ్లయ్య, మాజీ సర్పంచ్ బడిగింజల రంగన్న, మాజీ ఎంపీటీసీ ఆకుల వీరేష్, పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ ఏఈ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధి నిధులు రూ.40 లక్షలు, ఎంపీ నిధులు రూ.30 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆ నిధులతో పంచాయతీ పరిధిలో ఆయా కాలనీల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఒంటి పూట బడి..అప్రమత్తం కండి !

- సరదాల మాటున పొంచి ఉన్న ప్రమాదాలు
- నేటి నుంచి ఒంటి పూట బడులు
- బడి వదిలాక పిల్లల భద్రతపై కన్నేయాలి


జొన్నగిరి వద్ద బావిలో ఈత కొడుతున్న చిన్నారులు

తుగ్గలి : నీటిని చూడగానే పిల్లల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. తమకు ఈత రాదనే విషయం కూడా మర్చిపోతారు. తాము దిగుతున్న నీటి కుంటలు, చెరువులు, బావులు, వంకల్లో లోతు తెలియక ప్రాణాలు కోల్పోతున్నారు. అన్ని యాజమాన్య పాఠశాలలకు నేటి నుంచి ఒంటిపూట బడి ప్రారంభ మవుతుండడంతో పిల్లల ఆనందానికి అవధులుండవు. మధ్యాహ్నం నుంచి బడులకు సెలవు కావడంతో బడి నుంచి ఇంటికి రాగానే పుస్తకాల బ్యాగును మూలన పడేసి ఎంచక్కా ఆటల బాట పడుతుంటారు. ఈ ఆనందం వెన్నంటే విషాదాలు కూడా పొంచి ఉంటాయి. ఈత, మోటార్ సైకిల్ రైడింగ్, క్రికెట్ వంటివి మండే ఎండలో చిన్నారులను ముప్పుతిప్పలు పెట్టేవే. వీటి నుంచి పిల్లలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. వీటివల్ల జరిగే ప్రమాదాల గురించి పిల్లలకు అవగాహన పెంచాలి.

టీవీలతోనూ ముప్పే..

ఒంటిపూట బడుల సమయంలో పాఠశాల అయిపోగానే చిన్నారులను ఇంటికి తీసుకొని వచ్చి కాస్తంత భోజనం చేయించి కొద్దిసేపు పడుకునేలా చూడాలి. ఆ తరువాత ఇంటి పరిసరాల్లో, చెట్ల నీడలో ఆడుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. అలా కాకుండా ఇంట్లో నిత్యం టీవీలు, కంప్యూటర్, సెల్, లాప్ టాప్‌లు వీడియో గేమ్స్‌లకు అతుక్కుపోవడం వల్ల పిల్లల్లో దృష్టి లోపం తలెత్తే అవకాశం ఉందని నేత్ర వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎండలతో అనర్థాలు..

మార్చి నుంచే ఎండలు మండుతున్నాయి. పిల్లలను వీలైనంత వరకు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ సమయం ఎండలో ఉండడం వల్ల శరీరం వేడెక్కి పిల్లలకు వాంతులు, విరేచనాలయ్యే ప్రమాదం కూడా ఉంది. ఎండతాకిడికి ఒంటిలోని నీరంతా చెమట రూపంలో ఇంకిపోయి వడదెబ్బ తగిలే ప్రమాదం కూడా ఉంది. ఎండలకు పిల్లలు అధిక నీరు తాగేలా చూసుకోవాలి. అప్పుడప్పుడు మంచినీటిలో చిటికెడు ఉప్పు, చక్కెర వేసి ఇవ్వడం మంచిది. టెంకాయ నీరు తాపడం వల్ల నీరసం తగ్గి ఉత్తేజంగా ఉంటుంది.

చెరువులు, బావులతో ప్రమాదం..

గ్రామ శివారుల్లో బావులు, చెరువులు, వంకలు, కుంటుల ఉంటాయి. వీటిలో సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఒక వేళ వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా పెద్దలను వెంట పెట్టుకొని వెళ్లాలి తప్ప ఒంటరిగా వెళ్లకూడదు.

ఇవి పాటించాలి..

- ఒంటిపూట బడి వదలగానే మధ్యాహ్న వేళ పిల్లలను అవసరమైతే తప్ప బయటకు పంపకూడదు.
- తల్లిదండ్రులు పిల్లల కోసం అధిక సమయం కేటాయించాలి. ఖాళీ సమయాల్లో పిల్లల చేత విజ్ఞాన, వినోదానికి సంబంధించిన పుస్తకాలు చదివేలా అలవాటు చేయాలి.
- ఇంటిలోనే ఉంటూ నీడపాటున ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు క్యారంబోర్డు, చెస్‌లాంటి నీడపాటున ఆడేలా ఆటలు ఆడుకునేలా చూడాలి.
- పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి బయటకు వెళ్లేలా వారికి అవగాహన కల్పించాలి.